సాక్షి
చిత్తూరు
బుధవారం ౹ 8 ౹ మే ౹ 2024



వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ. జనసేన నుంచి నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



ప్రగతికి మరోపేరు 'పలమనేరు'

పలమనేరు నియోజకవర్గం ఈ ఐదేళ్లలో అద్భుతంగా అభివృద్ధి చెందడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. - 8లో



బీఎల్‌ఓల పాత్ర కీలకం

పోలింగ్ రోజున బీఎల్‌ఓల పాత్ర కీలకమని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

కాణిపాకంలో 'వేస్ట్ మేనేజ్‌మెంట్' పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న కమిటీ సభ్యులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసర ప్రాంతంలోని వ్యర్థ పదార్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి, (సాలిడ్– లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) విధానాలను మంగళవారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు పరిశీలించారు. ముందుగా వారు స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలు, బహుదా నది, తదితర ప్రాంతాలలో పర్యటించారు. అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ భాస్కర్ రావు, జాయింట్ చీఫ్ ఇంజినీర్ శ్రీరామ మూర్తి, జాయింట్ చీఫ్ ఇంజినీర్ రాజశేఖర్, ఇంజినీర్ అశోక్, అసిస్టెంట్ ఇంజినీర్ హరీష్, ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, ధనంజయ పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు పురస్కారం



రత్నారెడ్డికి అవార్డు అందిస్తున్న దేవేంద్రరావు తదితరులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పారిశ్రామికవేత్త రత్నారెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ప్రముఖ సాహితీవేత్తలకు పురస్కారాలు ప్రదానం చేశారు. మద్రిపూడి దేవేంద్రరావుకు రాష్ట్ర సాహితీపతి బిరుదు, సి.నారాయణస్వామికి సాహితీశిల్పి అవార్డు, సి.సుబ్రమణ్యంరెడ్డికి అక్షరశిల్పి పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజానికి జ్ఞాన నిర్దేశం చేయడంలో రచయితల పాత్ర కీలకమన్నారు. తెలుగు భాషను రక్షించుకునే క్రమంలో మద్రిపూడి దేవేంద్రరావు చేపట్టిన సాహితీ సదస్సులకు భాషాభిమానులు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం రత్నారెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం- 2024ను భారతీయ తెలుగు రచయితల సమాఖ్య వ్యవస్థాపకుడు దేవేంద్రరావు ప్రదానం చేశారు.

పలమనేరులో స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పలమనేరు : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం పరిశీలించారు. ఫెసిలిటేషన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఈవీఎంల భద్రతపై ఆరా తీశారు. ఆయన వెంట ఆర్డీఓ మనోజ్‌రెడ్డి ఉన్నారు.

నేషనల్ ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : గిరిజన అభ్యర్థులు నేషనల్ ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విదేశాల్లో పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టర్ రీసెర్చ్ ప్రోగ్రామ్, ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎంపికైన గిరిజన అభ్యర్థులు స్కాలర్‌షిప్ కోసం ఈ నెల 31వ తేదీలోపు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ www.overseas. tribal.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 76,748 మంది స్వామివారిని దర్శించుకోగా 30,688 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.10 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కళ్లుగప్పి కన్నడ మద్యం

ఎన్నికల వేళ జిల్లాలోకి కర్ణాటక మద్యం యథేచ్ఛగా ప్రవేశిస్తోంది. ఓటర్లను మత్తులో ముంచేందుకు సరిహద్దులను దాటి చొరబడుతోంది. ఈ మేరకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ నిఘాను కట్టుదిట్టం చేసింది. ఈ క్రమంలోనే మంగళవారం బంగారుపాళ్యం వద్ద రూ.లక్షల విలువైన కన్నడ లిక్కర్ తీసుకువస్తున్న ఓ కంటెయినర్ పోలీసులకు పట్టుబడింది. విచారణలో ఈ లోడ్ తిరుపతికి వెళుతున్నట్లు వెల్లడైంది. మద్యం తరలింపు వెనుక కూటమి అభ్యర్థుల హస్తం ఉన్నట్లు తెలిసింది.

- ఏరులా జిల్లాలోకి ప్రవాహం
- చెక్‌పోస్టులను దాటి అక్రమంగా ప్రవేశం
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు యత్నం
- తిరుపతికి తరలిస్తున్న రూ.లక్షల విలువైన లిక్కర్ పట్టివేత
- పోలీసుల అదుపులో నిందితులు
- రవాణా వ్యవహారంలో పూతలపట్టు టీడీపీ నేత హస్తం!
- మద్యం స్మగ్లింగ్‌లో తెరవెనుక కూటమి అభ్యర్థులు?



పట్టుబడ్డ మద్యం కంటైనర్

చిత్తూరు అర్బన్ : ఎన్నికల సందర్భంగా ప్రలోభాల పర్వం మొదలైంది. ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీకి రంగం సిద్ధమైంది. ఇందులో కూటమి అభ్యర్థులు విచ్చలవిడిగా ఓటర్లకు ఎరవేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా మద్యం బాటిళ్లను వెదజల్లి ఓట్లు రాబట్టుకోవాలని యత్నిస్తున్నట్లు సమాచారం. అయితే ఇక్కడి ప్రభుత్వ వైన్‌షాపుల్లో క్వార్టర్ కొనాలంటే కనీసం రూ.130–రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. అదే కర్ణాటకలో అయితే కేవలం రూ.35కు టెట్రా ప్యాకెట్, రూ.75కు క్వార్టర్ దొరుకుతోంది. దీంతో చీప్‌గా కన్నడ మద్యం కొనుగోలు చేసి జిల్లాకు అక్రమంగా తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్మగ్లింగ్ వ్యవహారానికి కూటమి అభ్యర్థులు పకడ్బందీ ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

రూ.లక్షల మద్యం పట్టివేత

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో కూటమి అభ్యర్థులు మరింత బరితెగిస్తున్నారు. ఓటర్లకు తాయిలాలతో ఎరవేస్తున్నారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి చీప్ లిక్కర్ తెప్పించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం బంగారుపాళ్యం సమీపంలోని టోల్ గేటు వద్ద ఓ కంటైనర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. అందులో పరిశీలిస్తే రూ.43 లక్షల విలువైన కర్ణాటక మద్యం కనిపించింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తే విస్తుబోయే వాస్తవాలు వెలుగుచూశాయి. మద్యం లోడ్‌ను తిరుపతికి తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. ఇందులో కూటమి పార్టీలకు చెందిన నేతలు కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. కర్ణాటకలో తక్కువ ధరకే మద్యం కొనుగోలు చేసి ఇక్కడి ఓటర్లకు పంపిణీ చేయాలని ప్లాన్ వేసినట్లు వివరించారు. ఇందుకోసం కూటమి అభ్యర్థులు తమ పార్టీలకు చెందిన కొందరు నేతలతో కలిసి మొత్తం వ్యవహారం నడిపించిట్లు తెలిసింది ముందుగా బెంగళూరుకు చెందిన ప్రకాష్ అనే వ్యక్తి ద్వారా 713 బాక్సుల కర్ణాటక మద్యాన్ని ఓ కంటైనర్‌లోకి ఎక్కించుకుని నామాల ముని కేశవ (కిరణ్) మరో ఇద్దరు జిల్లాకు బయలుదేరారు. సోమవారం రాత్రి నంగిలి వద్ద ఈ కంటైనర్‌ను పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తే, తప్పించుకున్నారు. చివరకు బంగారుపాళ్యం వద్ద, కంటైనర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో నిందితులు పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు వెంటబడి పట్టుకున్నారు. మద్యం స్మగ్లింగ్‌లో పూతలపట్టుకు చెందిన టీడీపీ నేత హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వీరికి కుప్పం నియోజకవర్గానికి పచ్చ నేత సహకరించినట్లు తెలిసింది. కంటెయినర్‌లోని మద్యంలో కొంత పూతలపట్టులో డంప్ చేసి మిగిలింది తిరుపతి తరలించాలని తమకు ఆదేశాలు అందినట్లు నిందితులు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. మద్యం స్మగ్లింగ్‌కు సహకరించిన కారణంగా కుప్పానికి చెందిన తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు సమాచారం. అలాగే కర్ణాటకలో మద్యం విక్రయించిన బెంగళూరుకు చెందిన డిస్టిలరీ యజమాని, వైన్‌షాప్ ఓనర్, క్యాషియర్‌పై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు.

పట్టుబడిన మద్యం ఆరణిదేనా..?

తిరుపతి తుడా : బంగారుపాళ్యం వద్ద పోలీసులకు పట్టుబడిన కర్ణాటక మద్యం తిరుపతిలో పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు చెందినదనే వార్తలు గుప్పుమన్నాయి. ఎన్నికల సందర్భంగా తిరుపతి ప్రజలను మత్తులో ముంచి ఓట్లు వేయించుకునేందుకే ఆయన రూ.లక్షల విలువైన మద్యం తెప్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనసేన అభ్యర్థిగా ఆరణి తిరుపతిలో అడుగు పెట్టినప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఆయన అంతటి ఘనుడే అని అర్థమవుతోందని కూటమి నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అసంతృప్తి నాయకులకు డబ్బు ఎరవేసి కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నారు. రూ.కోట్లు వెదజల్లి, ప్రలోభాలకు గురిచేసి, రౌడీయిజం చేయించి ఈ ఎన్నికల్లో గట్టెక్కాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని చెప్పుకుంటున్నారు. తిరుపతి పవిత్రత దెబ్బతీస్తున్నారంటూ ఎల్లో మీడియాలో నిత్యం నోరేసుకుని పడిపోయే కూటమి నేతలకు ఆరణి ప్రలోభాల పర్వం కనిపించడం లేదా అని స్థానికులు మండిపడుతున్నారు. ఓట్ల కోసం అసాంఘికశక్తులను తిరుపతి నగరిలోకి తీసుకువచ్చిన వారికి ఎలా మద్దతు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.



పకడ్బందీగా మాక్ పోలింగ్



ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పకడ్బందీగా మాక్ పోలింగ్ నిర్వహించారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ ప్రక్రియ చేపట్టామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల ఈవీఎంలను మాక్ పోల్ చేసి చూపించామని తెలిపారు. ఈవీఎంలపై ఉన్న అపోహలను తొలగించేందుకు ఈ ప్రక్రియ నిర్వహించినట్లు చెప్పారు. ఈవీఎంలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించామని వెల్లడించారు. అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ అరుణ, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మూడోరోజు 1,398 'పోస్టల్' ఓట్ల పోలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం మూడోరోజు మొత్తం 1,398 మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు మొత్తం 10,827 ఓట్లు పోల్ అయినట్లు వివరించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ పర్యవేక్షించారు. మూడురోజుల్లో జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలో 1,752, నగరిలో 1,123, జీడీ నెల్లూరులో 1,498, చిత్తూరులో 2,350, పూతలపట్టులో 1,445, పలమనేరులో 1,751, కుప్పంలో 908 మొత్తం 10,827 మంది ఉద్యోగులు ఓటేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 1,113 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకోవాల్సి ఉందని వెల్లడించారు.

కుప్పం దాహార్తికి శాశ్వత పరిష్కారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- రెండు రిజర్వాయర్లకు పాలనాపరమైన అనుమతులు
- హంద్రీ–నీవా పూర్తి చేస్తే పనికట్టుకుని విమర్శలు
- రూ.2.7 లక్షల కోట్లు డీబీ ద్వారా పేదలకు పంచాం
- 99 శాతం ఎన్నికల హామీలు నెరవేర్చాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం : కుప్పం అభివృద్ధిలో భాగంగా హంద్రీ–నీవా కాలువ పూర్తిచేసి రెండు రిజర్వాయర్లు, పాలారు ప్రాజెక్టుకు పాలనా పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం కుప్పం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుప్పం నియోజకవర్గానికి సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో హంద్రీ–నీవా కాలువ పూర్తి చేశామన్నారు. అంతేకాకుండా మాదనపల్లి, యామిగానిపల్లి వద్ద రెండు రిజర్వాయర్లు, పాలారు ప్రాజెక్టుకు పాలనాపరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. హంద్రీ–నీవా కాలువపైన ఎల్లో బ్యాచ్ దుష్ప్రచారం చేస్తున్నారని, వారంతా ప్రత్యేక మేధావుల బృందంతో పనులను పరిశీలించి విమర్శించాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన సాగించారని తెలిపారు. నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు రూ.2.7 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా వారి ఖాతాల్లో జమచేశారని గుర్తుచేశారు. లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని, మీరే స్టార్ క్యాంపెయినర్లుగా పనిచేయాలని సూచించారు. ఐదు సంవత్సరాలు పేదరిక నిర్మూలనే లక్ష్యంగా నవరత్నాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేయగలిగామని చెప్పారు. చంద్రబాబు తన సొంత నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. బీసీలు అధికంగా ఉన్న కుప్పంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన భరత్ వైఎస్సార్ సీపీ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, బీసీలు ఆయన్ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థిగా రెడ్డెప్ప చిత్తూరు పార్లమెంటుకు రెండోసారి పోటీ చేస్తున్నారని, ఆయన్ను కూడా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్, మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'నేత'కు ఒక్క ఆర్డరైనా ఇప్పించారా?



- మంచి చేసే వారిని ఆదరించండి
- మభ్యపెట్టేవారిని తరిమికొట్టండి
- మంత్రి ఆర్కేరోజా



ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్కేరోజా

నగరి : 'మరమగ్గనేతకు ఒక్క మీటరు ఆర్డరైనా టీడీపీ ఇప్పించిందా..?' అంటూ మరమగ్గ సామాజిక వర్గాలవారిని మంత్రి ఆర్కేరోజా ప్రశ్నించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలో మరమగ్గ సామాజికవర్గం వారు ఎక్కువగా నివసించే కొత్తపేట, ఏకాంబరకుప్పం ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. స్థానిక మరమగ్గ నేత కార్మికులు ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. తమ ఇంటి బిడ్డ వచ్చిందన్నంత ఆనందంతో స్థానికులు మురిసిపోయారు. ఈ సందర్భంగా మంత్రి ఐదేళ్ల పాలనలో నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టిన పనులు, నిర్మించిన భవనాలు, ఏర్పరచిన వసతులను చిత్రపటాలతో సహా ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ యూనిఫామ్ ఆర్డరు ఒక్క మీటరైనా మరమగ్గకార్మికులకు ఇప్పించలేదన్నారు. తాను 23 లక్షల మీటర్ల గుడ్డకు ఆర్డరు ఇప్పించినట్లు తెలిపారు. ఒక్కరికైనా ఆధునిక మరమగ్గాలపై టీడీపీ శిక్షణ ఇవ్వలేదని మండిపడ్డారు. తాను మంత్రి అయ్యాక పట్టుచీరల నేతపైనా, ఆధునిక మరమగ్గాల నేతపైనా శిక్షణ ఇప్పించానని గుర్తుచేశారు. తమిళ మాధ్యమం చదివే విద్యార్థులకు గతంలో పుస్తకాలు ఇచ్చేవారు కారని, సీడీలు తెప్పించుకొని ముద్రించుకునే పరిస్థితి ఉండేదన్నారు. తమిళనాడు ప్రస్తుత, గత ముఖ్యమంత్రులిద్దరితోనూ చర్చించి తాను విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు తెచ్చి ఇచ్చినట్టు తెలిపారు. గతంలో జన్మభూమి కమిటీవారి ఆశీస్సులు పొందిన కొందరికే వీవర్స్ పెన్షన్ వచ్చేదని, నేడు 2,670 వీవర్ పెన్షన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. రంగునీటి శుద్ధీకరణ ప్లాంటు నిరుపయోగంగా మారితే దానికి చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు రూ.2.75 కోట్లు తాను ప్రభుత్వంతో చర్చించి చెల్లించానన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ కేటగిరి మార్చి గెజిట్ ఇచ్చేయడం, అది 2022లో అమలులోకి రావడంతో తాను ముఖ్యమంత్రితో చర్చించి విద్యుత్ బిల్లు తగ్గించానన్నారు. కరోనా సమయంలో తాను మాత్రమే వచ్చి సేవలందించానని, నాడు టీడీపీ వారు ఏమయ్యారని ప్రశ్నించారు. నాడు రాని టీడీపీ వారు నేడు బూటకపు మేనిఫెస్టోతో మభ్యపెట్టేందుకు వస్తున్నారని, ప్రజలు వారిని తరిమికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, భూపాలన్, బాబు, మురుగ, ఇంద్రయ్య, మాజీ కౌన్సిలర్ పుష్ప, కో–ఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, నాయకులు అమర్, ఎంఎం రాజ, ఎంకేఎస్ మణిగండన్, ఎంబీ రాజ, గోపాల్ రెడ్డి, ఎస్‌బీ మూర్తి, జీపీఎం.మణి, ఎస్పీ షణ్ముగం, తనిగవాసన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి జగనన్నే చిరునామా



అగరమంగళంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి స్వాగతం పలుకుతున్న ప్రజలు



వెజ్జుపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: అభివృద్ధికి, సంక్షేమానికి చిరునామా సీఎం జగనన్న అని డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి కొనియాడారు. మంగళవారం ఆయన మండలంలోని అగరమంగళం, వెజ్జుపల్లి పంచాయతీలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీప్రియదామోదరం ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేదల జీవితాలలో వెలుగులు నింపిన దేవుడు జగనన్న అని తెలిపారు. పేద ప్రజలకు జరుగుతున్న మంచిని ఓర్వలేక దుష్టశక్తులు ఎన్నో ప్రయత్నాలు చేసి అడ్డంకులు సృష్టించాయని మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో మంచి చేసిన జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్‌కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, జిల్లా రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మునిరాజారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరక నెల్లూరు కోదండన్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్, సీనియర్ నాయకులు నాయనిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, ఎంపీటీసీ ఇందిర, వెజ్జుపల్లి సర్పంచ్ హరిప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ బాలసుబ్రమణ్యంరెడ్డి, మండల నాయకులు దామోదరం, గోపి, చిట్టి, వెంకటేశు, రుక్మానందరెడ్డి పాల్గొన్నారు.


పలమనేరు ఏరియా ఆస్పత్రి

పలమనేరు పట్టణంలో..

పలమనేరు పట్టణంలో నూతనంగా రోడ్లు, సచివాలయ భవనాలు నిర్మించారు. ముఖ్యంగా స్థానిక ఏరియా ఆస్పత్రిని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. సుమారు రూ.17 కోట్లతో ఆధునికీకరించారు. 50 పడలక ఆస్పత్రిని వంద పడకలుగా మార్చారు. అవసరాలకు అనుగుణంగా వైద్యసిబ్బందిని నియమించారు. నాణ్యమైన చికిత్సలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

అద్భుతంగా ఆస్పత్రి



పలమనేరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇది చూస్తే చాలు ఈ ప్రభుత్వం వైద్యానికి ఎంత ప్రాముఖ్యతనిచ్చిందో అర్థమవుతుంది. సీఎంసీ ఆస్పత్రిని తలదన్నేలా ఉంటుంది. ఇక్కడ రోగులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారు.

- నవ్య, పలమనేరు

మంచి చేసే వాళ్లకే..



పేదల కష్టాలు అర్థం చేసుకుని మంచి చేసే వాళ్లకే మద్దతుగా నిలబడతాం. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీలు గుప్పించి తర్వాత వాటిని గాలికి వదిలేసే వారికి మళ్లీ గుణపాఠం చెబుతాం. ఈ ఐదేళ్లలో మా పలమనేరు రూపురేఖలు మారిపోయాయి. ఊర్లో నడుస్తుంటే ఆనందంగా ఉంది.

- షరీఫ్, పలమనేరు

పలమనేరు మండలంలో..


పత్తికొండలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

ఈ ప్రాంతంతోపాటు గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో రైతులు ఎక్కువగా కూరగాయ పంటలనే సాగు చేస్తుంటారు. వీరి సంక్షేమ కోసం ప్రభుత్వం రూ.11 కోట్లతో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోంది. దళారీ వ్యవస్థను అరికట్టి రైతులకు అండగా నిలిచింది.

ఇలా ఎవరూ చేయలేదు



మా ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరం. మేము పండించిన పంటలకు గిట్టుబాటు ధర వస్తోంది. యూనిట్ నిర్వాహకులు కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం కుదురుచకుని మాకు చక్కటి ధర ఇస్తున్నారు. ఇలా గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదు.

- వెంకటమునిరెడ్డి, కల్లాడు

హామీలు నెరవేర్చేవారికే..



ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాయమాటలు చెప్పేవారిని ఇక నమ్మేదే లేదు. నేను ఎంబీఏ చదువుకున్నా. ఎవరు ఎలాంటి నాయకులో మాకు బాగా అర్థమవుతుంది. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చే నాయకుడినే ఎన్నుకుంటాం. అలా మాట మీద నిలబడేవారే ప్రజలకు మేలు చేయగలరు.

- రామచంద్రారెడ్డి, కల్లాడు

'గుడ్'మార్నింగ్



ప్రగతికి మరో పేరు పలమనేరు

- పేదల బతుకుల్లో నవరత్న వెలుగులు
- రూ.2,735 కోట్లతో అభివృద్ధి.. సంక్షేమ పథకాలు
- సాగు సంబరంగా మారిందంటున్న రైతులు
- నాణ్యమైన వైద్యం.. విద్య అందుబాటులోకి వచ్చాయంటున్న ప్రజలు

పలమనేరు నియోజకవర్గంలో ‘సాక్షి’ బృందం మంగళవారం రోడ్ షో నిర్వహించింది. ఉదయం 10 గంటలకు పలమనేరు పట్టణం నుంచి మొదలైన పర్యటన గంగవరం.. పెద్దపంజాణి.. బైరెడ్డిపల్లె.. వి.కోట మండలాల మీదుగా సాగింది. ఎక్కడికక్కడ స్థానికులతో మమేకమవుతూ ప్రజాభిప్రాయం సేకరించింది. ఈ మేరకు ప్రగతికి మరోపేరులా పలమనేరు నియోజకవర్గం కనిపిస్తోంది. సచివాలయాలు.. ఆర్‌బీకేలు.. ఆస్పత్రులు.. డిజిటల్ లైబ్రరీలు.. పాల కేంద్రాలు.. అంగన్‌వాడీ బడులు.. నాడు–నేడు కింద తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలతో పల్లెసీమల్లో అభివృద్ధి అద్భుతంగా ఆవిష్కృతమైంది. ఇక పట్టణ ప్రాంతంలో సైతం అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు అత్యున్నత వైద్యసేవలు అందుతున్నాయి. ఈ ఐదేళ్లలోనే సంక్షేమ పథకాల కింద రూ.2,210 కోట్లు లబ్ధిదారులకు చేరాయి. రూ.425 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వ పనితీరుపై అన్ని వర్గాలూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

– పలమనేరు

పర్యటన సాగిందిలా..

సోమవారం ఉదయం పది గంటలకు పలమనేరులోని వందపడకల ఆస్పత్రిని పరిశీలించాం. గంగవరం మండలంలోని కొత్తపల్లి సచివాలయాని ఉదయం 11 గంటలకు వెళ్లి అక్కడి సేవలపై ప్రజలతో మాట్లాడాం. మధ్యాహ్నం 12 గంటలకు పెద్దపంజాణి మండలంలోని కమ్మపాళెం రైతుభరోసా కేంద్రానికి వెళ్లి రైతులకు అందుతున్న సేవలపై అభిప్రాయాలను తీసుకున్నాం. మధ్యాహ్నం 2 గంటలకు బైరెడ్డిపల్లి పీహెచ్‌సీని పరిశీలించి అక్కడి సేవలపై ఆరాతీశాం. వీకోట పట్టణంలోని భారతనగర్ ప్రాంతంలో అమ్మఒడి ద్వారా లబ్ధిపొందిన వారి తో మాట్లాడాము. సాయంత్రం 4 గంటలకు పలమనేరు, గంగవరం మండలాలకు సంబంచి పత్తికొండ ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్‌యూనిట్‌ను గమనించి అక్కడ రైతులకు అందుతున్న సేవలు, రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సాక్షిబృందం తీసుకొంది.

గంగవరం మండలంలో..



కొత్తపల్లె సచివాలయం

మండలంలోని కొత్తపల్లెలో అభివృద్ధి వెలుగులు కనిపిస్తున్నాయి. ప్రజలకు సచివాలయాల ద్వారా సులువుగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. సంక్షేమ పథకాలు ఇంటిముంగిటకే వస్తున్నాయి. సీసీ రోడ్లు అందుబాటులోకి వచ్చాయి. రక్షిత మంచినీరు సరఫరా అవుతోంది.

పక్కాగా సేవలు



ఇదివరకు ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా ఊర్లోని సచివాలయంలోనే పక్కాగా సేవలు అందుతున్నాయి. ఇక్కడే అన్ని సర్టిఫికెట్లు ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు, పురుగుమందులు రాయితీ ధరకు అందిస్తున్నారు. మాకు చాలా సంతోషంగా ఉంది.

- చెంగప్ప, కొత్తపల్లె

మాకోసం ఆలోచించేవారికే..



గ్రామీణ ప్రాంతాల్లోని వారికి కేవలం ఎన్నికలప్పుడే నేతలు పట్టించుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గడప గడపకు ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేనే మా ఊరికి వస్తున్నారు. మా కష్టాలు, సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. ఇదంతా మాకు కొత్తగా ఉంది. ఇప్పుడు అనిపిస్తోంది.. మాకోసం ఆలోచించేవారికే ఓటేయాలని, వారి వెంటే నడవాలని. **- వెంకటరమణ, కొత్తపల్లె**

బైరెడ్డిపల్లె మండలంలో ..



బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మండల కేంద్రంలో రూ.కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రిని రూ.1.50కోట్లతో భవనం నిర్మించారు. 24 గంటలపాటు సేవలు అందించేలా సౌకర్యాలు కల్పించారు. రెండు 108 వాహనాలు, ఒక 104 వాహనాన్ని అందుబాటులో ఉంచారు. పల్లెవాసులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు.

ఆనందంగా ఉంది



ఇది వరకు ఎవరైనా అనారోగ్యం బారిన పడితే పలమనేరుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా ఊర్లోనే చక్కటి వసతులతో ఆస్పత్రి నిర్మించారు. నిపుణులైన వైద్యులతో చికిత్సలందిస్తున్నారు. ఇక్కడి వైద్యసేవలను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మాకు ధైర్యం వచ్చింది.

- విసి, బైరెడ్డిపల్లె

మా కష్టం తీర్చేవారికే..



ఒకప్పుడు మేము పింఛన్ తీసుకోవాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా ఇంటికే పింఛన్ సొమ్ము వస్తోంది. మా ఊర్లోని బడి, ఆస్పత్రిని చూస్తే గర్వంగా ఉంది. ఈ విధంగా మా కష్టం కనిపెట్టి తీర్చేవారికే అండగా ఉంటాం.

-వెంకటరామిరెడ్డి, సీసీ గుంట

పెద్దపంజాణి మండలంలో..

మండలంలోని కమ్మపాళెంలో ప్రభుత్వ ఫలాలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ ఆర్‌బీకే కేంద్రం సేవలను స్థానిక రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. అలాగే చిలకపుత్తూరు, వడ్డిపల్లెలో సైతం అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు.

టౌన్‌కి పోయే పనేలేదు



ఆర్‌బీకే వచ్చా టౌన్‌కి వెళ్లే పనేలేకుండా పోయింది. నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు మాకు గ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయి. చీడపీడలపై ఏమైనా సందేహాలు, అనుమానాలుంటే ఆర్‌బీకే సిబ్బంది పంటల కాడికొచ్చి చూసి సలహాలిస్తున్నారు. ఇంతకు ముందు ఓ బస్తా యూరియా కావాలన్నా పలమనేరు పోయి తెచ్చుకొనేవాళ్ల.ఇప్పుడా బాధ తప్పింది.

- లోకేష్, చిలకపుత్తూరు

అండగా నిలిచేవారికే..



ఆరుగాలం కష్టించే అన్నదాతకు అండగా నిలిచేవారికే మద్దతుగా నిలుస్తాం. రైతు సంక్షేమానికి పాటుపడే ప్రభుత్వానికే జై కొడతాం. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే వారినే గెలిపించుకుంటాం. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన వారి వెంటే నడుస్తాం.

- రమణప్ప, వడ్డిపల్లె

వి.కోట మండలంలో..

మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను నాడు–నేడు కింద అద్భుతంగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు చక్కటి వసతులు కల్పించారు. నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. దీంతో పిల్లలు సైతం పాఠశాలకు వెళ్లేందుకు, ప్రభుత్వ బడిలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

చక్కగా చదువుకుంటోంది



వి.కోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మా అమ్మాయి తొమ్మిదో తరగతి చదువుతోంది. కార్పొరేట్ స్కూళ్లకు మించి ఇక్కడి పాఠశాలలో వసతులు ఉన్నాయి. ఉపాధ్యాయులు ఇంగ్లిష్ మీడియంతో బోధిస్తున్నారు. మా బిడ్డ చక్కగా చదువుకుంటోంది. ప్రభుత్వం సైతం అమ్మఒడి పథకంతో ఆదుకుంది. మాకు చాలా సంతోషంగా ఉంది.

- గాయత్రి, వి.కోట

విద్యకు ప్రాధాన్యమిచ్చేవారికే..



పిల్లలకు చదువే గొప్ప ఆస్తి. వారికి బాగా చదివిస్తే చాలు.. వారి వల్లే కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి. అందుకే విద్యారంగం అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చేవారికే మద్దతుగా నిలబడతాం. ఈ ప్రభుత్వంలో ఆ దిశగా మంచి అడుగులు పడ్డాయి. ఇవి కొనసాగించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉంది.

- కస్తూరి, భారత్‌నగర్, వి.కోట

వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు


పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం ఈ మేరకు పలమనేరులోని పార్టీ కార్యాలయంలో పట్టణంలోని రెండో వార్డుకు చెందిన 19మంది యువకులు టీడీపీ, జనసేనను వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు.గంగవరం మండలం బీడీకాలనీ, డ్రైవర్స్‌కాలనీలకు చెందిన ఖాజ,అలీం, అహ్మద్, నదీం, షాహిల్, ఖాజా అక్రమ్ పార్టీలో చేరారు.

పత్తికొండకు చెందిన పాలేగారు కృష్ణప్పనాయుడు, జయశంకర్, తేజ వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కండువాలు వేసి ఆహ్వానించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లె పంచాయతీ చిన్నప్పరెడ్డిపల్లెకు చెందిన పలువురు టీడీపీ నాయకులు సర్పంచ్ ధనంజయ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గంగవరంలో..

గంగవరం : మండలంలోని కీలపట్ల పంచాయతీ బండమీద జరావారిపల్లెకు చెందిన 20 కుటుంబాల టీడీపీ వారు స్థానిక నేతల సమక్షంలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు.వీరిలో రెడ్డెప్ప, అనిల్, రత్నప్ప, గోపి, వాసుగౌడు, చిన్నబ్బ, భూపతి, సుబ్రమణ్యం, లోకనాథం, ఉలుకూరప్ప, చంద్రయ్య, మురళి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మహేన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, రఘునాథరెడ్డి, శంకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, రవి, చెంగల్రాయులు, వసరాయగౌడ, చంద్రబాబు, రమేష్ పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక ఇరువారం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుడు డేవిడ్ ఆధ్వర్యంలో స్థానిక 20వ డివిజన్ పోతుంబట్టుకు చెందిన టీడీపీ నాయకులు 43 మంది పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వారిని కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో రాధ, రాము, ధనలక్ష్మి, పద్మనాభరెడ్డి, రాజమ్మ, విశ్వనాథరెడ్డి, శరత్‌కుమార్, చిట్టి, మార్కొండరెడ్డి, సుమతి, పృథ్వీరెడ్డి, వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, రోజా, ఈశ్వరమ్మ, శాంతకుమారి, కిషోర్, చిన్ని, అశోక్‌రెడ్డి, మణెమ్మ, హంస, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మాధవి,శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: దిగువ తడకర పంచాయతీలో టీడీపీకి చెందిన 70 కుటుంబాల బలిజలు, కాపులు, ఎస్టీలు మంగళవారం రాత్రి తవణంపల్లె జెడ్పీటీసీ సభ్యులు భారతి,స్థానిక నాయకుడు మధుకుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, పూతలపట్టు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జి. ప్రకాష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు హరిరెడ్డి, తవణంపల్లె ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, ఎస్ఆర్‌ఎ ఎన్.దీపరెడ్డి పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం : మండలంలోని సంతూరు గ్రామానికి చెందిన 10 మంది పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో నవీన్‌కుమార్‌నాయుడు, కె.వెంకటరమణ, నాగరాజునాయుడు, రాజప్ప, సంపత్‌నాయుడు, సుబ్రమణ్యంనాయుడు, సి.సుబ్రమణ్యం, సుదర్శన్‌నాయుడు, మునిరాజు, అరుణ్‌కుమార్, కె.ఆనందప్ప, కె. సుబ్రమణ్యంనాయుడు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దన్న, మురళి, వెంకటరమణ, గణేష్, కృష్ణ, రవి, బాబు పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

గడప గడపలో గౌరవం

- ప్రజల కోసం పనిచేసే లీడర్ నేను
- మంత్రి రోజా


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రోజా

పుత్తూరు: ప్రజల కోసం పనిచేసే లీడర్‌నని, అందుకే గడప గడపలో తనకు గౌరవం లభిస్తోందని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఎప్పుడు స్మగ్లర్ల కోసమే పనిచేస్తుంటారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో టీడీపీ నేతలు పెడుతున్న తప్పుడు వీడియోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసేవే పరమావధిగా అడుగులు వేస్తున్నందువల్లే నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఐదేళ్లుగా ప్రజల మధ్యనే ఉంటున్నానని వెల్లడించారు. ముద్దుకృష్ణమనాయుడు మరణానికి కారణం భానుప్రకాషే అని స్వయానా అతడి తల్లి, తమ్ముడే చంద్రబాబు వద్ద చెప్పుకొని వాపోయారని టీడీపీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారని తెలిపారు. గంజాయి, రైస్, లిక్కర్ స్మగ్లర్ల కోసం పనిచేసే భానుప్రకాష్‌కు తనను విమర్శించే అర్హత లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీలో లబ్ధి పొంది, పదవులు అనుభవిస్తూ తనకు వెన్నుపోటు పొడిచిన నేతలు ఇప్పుడు టీడీపీలో చేరారని మండిపడ్డారు. ఇక నగరి నియోజకవర్గంలో వెన్నుపోట్లకు తావులేదని తెలిపారు. పేద ప్రజలు కోరుకున్న విద్య, వైద్యం, ఇళ్ల వంటి మౌలిక సదుపాయాలన్నీ అందించామని తెలిపారు. మీ ఓటు ఎవరికి అని ఎవరిని ప్రశ్నించినా జగనన్నకే అని సమాధానమిస్తున్నారని వెల్లడించారు. తాను ఈ అభివృద్ధి చేశానని చూపుతున్నానని, మీరు చేసిన అభివృద్ధి ఇదీ అంటూ చూపగలరా అని ప్రశ్నించారు. మీరు చేసిన మంచి లేదు కనుకనే నాపై తప్పుడు ఆరోపణలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. కరోనా సమయంలోనూ ప్రజలకు అండగా నిలబడిన మహిళను ఇంతమంది టార్గెట్ చేస్తున్నారంటే తన కు ఎంత ప్రజాబలం ఉందో అర్థమవుతోందన్నా రు. నగరిలో ఇప్పటి వరకూ ఎవరూ చేయలేని అభివృద్ధి, సేవా కార్యక్రమాలను తాను చేశానని గర్వంగా చెప్పగలనని తెలిపారు. అందుకే నగరి ప్రజలు తనను సొంత బిడ్డలా ఆదరిస్తున్నారని వెల్లడించారు.

పోలింగ్‌లో బీఎల్‌ఓల పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల పోలింగ్ రోజున బీఎల్ఓల పాత్ర కీలకమని జేసీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం చిత్తూరు పీవీకేఎన్ కళాశాలలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను బీఎల్‌ఓలు మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ నాడు అప్రమత్తంగా, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఓటర్ స్లిప్పులు తమకు అందలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత బీఎల్ఓపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లందరికీ కచ్చితంగా స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రకారం మృతులు, డబుల్ ఎంట్రీలకు సంబంధించిన పురుషులు, మహిళలు, ఇతరుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 11వ తేదీన ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో టాం టాం వేయించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓ అరుణ పాల్గొన్నారు.